## మినీకథ

# దోపిడి

రాజు కొత్తగా బిజినెస్ ప్రారంభించాడు. అడపాదడపా తప్ప పెద్దగా వ్యాపారం సాగటంలేదు. ఆరోజు ఉదయం షాప్ తెరచి న్యూస్ పేపరు తిరగేస్తూ కూర్చున్నాడు దేవుడి పూజచేసి.

"సార్!" అంటూ ఎవరో పిలవటంతో కస్టమర్ అనుకుని తలతిప్పి చూశాడు. నలుగురు కుర్రాళ్ళు నిల్చుని ఉన్నారు.

"వినాయక చవితి చందా సార్!" దేవుడి పేరు చెప్పేసరికి కాదనలేక పదిరూపాయలు తీశాడు జేబులోనుంచి.

"పాతిక రూపాయలకు తక్కువ తీసుకోమండి" దృఢంగా చెప్పారు వాళ్ళు.

"పాతికా!" అనుకుంటూ మరో పదిహేను తీసి పాతికరూపాయలిచ్చి పంపాడు.

మరో అరగంట గడిచింది. కస్టమర్స్ రాలేదుగాని మరో కుర్రాళ్ళ బేచ్ వచ్చింది నోట్‌బుక్ పెన్ను పట్టుకుని.

"సార్ కొత్తగా గుడికట్టిస్తున్నాం... మీనంతు మాటవరపోర్లు" అంటూ తన కింద గుమస్తాపై ఆర్డరువేసే ఆఫీసర్లా చెప్పాడు.

"అదేంటయ్యా బాబూ! మాకు తోచినంత ఇస్తాంగానే... ఎంతివ్వాలో మీరు చెప్పటమేంటి" అమాయకంగా అడిగాడు రాజు.

వెర్రివాడిని చూసినట్టు పైనుంచి కిందకి ఎగాదిగా చూశారు రాజును.

"అదేం కుదరదండి. షాపుకింత... అని మేము నిర్ణయించిన తరువాత అంతకు తక్కువిస్తే తీసుకోం" తెగేసి చెప్పారు వాళ్ళు.

"అంత ఇవ్వాలంటే కష్టమండీ. నేనేమో కొత్తగా బిజినెస్ పెట్టాను. వ్యాపారమూ అంతంత మాత్రమే. పన్నెండవుతున్నా బోణీ కాలేదు...." అంటూ అనునయంగా కష్టసుఖాలు చెప్పబోయాడు రాజు.

"ఈ సోదంతా మాకనవసరం. మీ బిజినెస్ బాగుంటే పిలిచి మాకు ఎక్కువిస్తారా ఏంటి. ఇదిగో ఈ పుస్తకంలో చూడు... అన్ని షాపులవాళ్ళు ఇస్తారు... మాటవరపోర్లకంటే తక్కువిస్తే ఊరుకునేది లేదు" కాలర్ ఎగరేస్తూ అంటుంటే రాజుకి కళ్ళనీళ్ళు ఒక్కటే తక్కువ.

చేసేది లేక మాట్లాడకుండా డబ్బిచ్చి పంపాడు.

ఏదో బతుకు తెరువు కోసం బ్యాంక్ లోను తీసికొని తెలిసినచోట నోట్లువ్రాసి అప్పులు తెచ్చి బిజినెస్ పెట్టుకుంటే చందాల పేరుతో దేవుడినడ్డుపెట్టుకుని...రౌడీయిజం చేసి దోచేస్తున్నారు.

సాయంత్రం లోపు మరో నాలుగు రకాల చందాల వాళ్ళు వచ్చారు. షాపు మూసేముందు ఉదయం నుంచి అయిన ఖర్చు లెక్కచూస్తే రాజు గుండె గుభేల్‌మంది. సేల్స్ ఖర్చులో నాలుగోవంతు కూడా లేదు. నెలరోజులకి ఇంట్లో ఖర్చులకొచ్చే సొమ్ము ఒక్క రోజులో ఖర్చయింది.

"సార్!"

ఏడుపు మొహంతో తలెత్తాడు రాజు "మీకు చందా ఇవ్వాలా!" అంటూ.

ఎదురుగా ముగ్గురు నిలబడున్నారు.

"అదికాదు సార్! ఇక్కడి కుర్రాళ్ళు మరీ రౌడీయిజం చేసి చందాలు వసూలు చేస్తారు. ఈ డబ్బంతా వాళ్ళ తాగుడుకి జల్సాలకి ఖర్చుచేసేసి మళ్ళీ శ్రీరామనవమి చందా అనో వినాయకచవితి అయ్యాక దసరా చందా అనో ఏదో వంకతో న్యాసీలుగా తయారవుతారు." చెప్పాడు వాళ్ళల్లో ఒకతను.

"తెలుసయ్యా! కానీ ఏంచేసేది?" దిగాలుగా అడిగాడు రాజు.

"మీరు నెలకి నాలుగొందలు మాకిచ్చారంటే మేము కుర్రాళ్ళ వల్ల మీకే గొడవలు రాకుండా చూస్తాం. లేదంటారా... మీరు ఈ సెంటర్‌లో ఎంతోకాలం బిజినెస్ చెయ్యలేరు" నిర్లక్ష్యంగా చెప్పారు.

సినిమాల్లో రౌడీల మాదిరి రఫ్‌గా ఉన్న వాళ్ళని చూస్తుంటే రాజుకి నోటమాట రావటం లేదు... కళ్ళప్పగించి చూస్తుండిపోయాడు.

"రేపు ఉదయం వచ్చి తీసికెళతాం... క్యాష్ రెడీ చేసి ఉంచండి" ఆర్డరు పారేసి "పదండిరా" అంటూ వెళ్ళిపోయారు.

"నేను అప్పులు చేసి బిజినెస్ పెట్టుకుని పెళ్ళాంబిడ్డల్ని పోషించడానికా ఈ వెధవలికి డబ్బు పంచడానికా! ఛీ వెధవ బ్రతుకు" రాజు నిస్సహాయంగా పళ్ళునూరుకున్నాడు.

— రాణీమాలిని



## మళ్ళీ సినిమాలు

జాన్ మెక్రోను పెళ్ళి చేసుకున్న ఇన్నాళ్ళకి మళ్ళీ టాటమ్ ఓనీల్ సినిమాల్లో నటించాలనుకుంటోంది. మా అమ్మ మత్తుపదార్థాలకు అలవాటు పడటంవలన నేను చిన్నతనంలో ఎన్నో బాధలు పడ్డాను. అటువంటి పరిస్థితి నా పిల్లలకి రాకుండా జాగ్రత్త పడిన తర్వాతనే మళ్ళీ నటించాలని అనుకుంటున్నాను అంటోంది టాటమ్.

## మనిషికో న్యాయం?



సినిమాల్లో నటించాలనే ఉద్దేశంతో భర్తను విడిచిన డింపుల్ తన కూతురు ట్వింకిల్ సినిమాల్లో వేస్తానంటే అడ్డుకుంటోందని వస్తున్న వార్తల గురించి అడిగితే — ట్వింకిల్‌కి ఏది

వచ్చితే అదే చెయ్యనియ్యండి. అయితే తన చదువు పూర్తి అయ్యేవరకూ ఆగమనండి — అంటోంది డింపుల్.